


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**పీటర్ ఆమె ముఖ కవళికలు** చూద్దామనుకున్నాడు. కానీ ఆమె అటు తిరిగి డ్రైవర్‌తో మాట్లాడుతూ ఉండటంతో మొహం కనబడలేదు.

సోఫా వెనుక నక్కి వింటూన్న అశ్వత్థామకి పై ప్రాణాలు పైనే పోయినయ్. ఈపాటికే సత్యం అనూజ్ఞని కలుసుకుని ఉంటాడని అతనికి తెలుసు. ఇక్కడేమో కథ ఇలా మారింది. ఇప్పుడు కళ్యాణి అనూజ్ఞని కలుసుకుంటే మొత్తం బయటికి వస్తుంది. సత్యం సాక్ష్యాలతో సహా దొరికిపోతాడు.

అశ్వత్థామ ఇక ఆలస్యం చేయలేదు. గబగబా మెట్లు దిగి క్రిందికి వెళ్ళాడు. పైకి వస్తూన్న డ్రైవర్ పక్క నుంచి మామూలుగా వెళ్ళిపోయాడు. ఒక్కసారి కారులో కూర్చున్నాక అతడు వేగంగా హోటల్ వైపు దూసుకు పోయాడు. సత్యం అనూజ్ఞని కలుసుకోక ముందే తను శ్రీకళ్యాణిని అంతం చెయ్యలేకపోయానని చెప్పాలని అతని ఉద్దేశ్యం.

హోటల్ బయట ఆవరణలో కారులో కూర్చుని ఉన్న ప్రతాపరెడ్డి, ఆ సమయంలో అక్కడికొచ్చిన అశ్వత్థామని చూసి భృకుటి ముడిచాడు. తమ ఒరిజినల్ ప్లాన్‌లో ఇది లేదు.

ఎక్కడో ఏదో తప్పు జరిగిందని అతడికి అనిపించింది.

4

**లోపలికి** ఎవరో ఆగంతకుడు రావడం చూసి విస్మయంతో 'ఎవరు నువ్వు' అని అడిగింది అనూజ్ఞ.

''నమస్తే, నా పేరు సత్యం'' అన్నాడు.

''ఏం కావాలి?''

''నీతో కొంచెం మాట్లాడాలి.''

ఆ ఏకవచన సంబోధనకి ఆమె మొహం చిట్లించింది. ''ఏం మాట్లాడాలి? అసలు ఎవరు నువ్వు?''

''నువ్వు ప్రేమించిన కార్తికేయ భార్య. నాకు వరసకి మరదలవుతుంది. మరో రకంగా చెప్పాలంటే మధ్యలో కార్తికేయ రాకపోతే నాకు భార్య అయ్యేది.''

''అసలు విషయం చెప్పు.''

''దానికే వస్తున్నాను'' తాపీగా అన్నాడు సత్యం. ''...నువ్వూ, కార్తికేయా మంచి జంట అవుతారు. ఆ విషయం నాకు తెలుసు. మీకు నేను అడ్డురాను, మీరిద్దరూ పెళ్ళి చేసుకొని ఇక్కడ నుంచి వెళ్ళిపోతే సంతోషించే మొదటివ్యక్తిని నేనే. కావాలంటే మీ పెళ్ళి రిజిష్టర్‌లో సాక్షి సంతకం కూడా నేనే పెడతాను.''

''అలాంటి అవసరాలు నాకేమీ లేవు.''

''నాకున్నాయి'' సత్యం నవ్వాడు. ''...నీవు మంత్రి కూతురివి. మీ నాన్న కోట్లు సంపాదించాడు. మీకు ఇక డబ్బు అవసరం లేదు. అందుకని ఈ ఆస్తి తనకి అవసరం లేదనీ, సత్యానికి ఇచ్చేస్తున్నాననీ కార్తికేయతో కాగితం రాయించి రిజిష్టర్ చేయించాలి. నా మరదలి ఆస్తి నాకిప్పించు. నీకు నా మరదలి మొగుడ్ని వదిలి పెడతాను.''

''నీకు మతిపోయింది. కళ్యాణి ఆస్తి కార్తికేయ నీకు వ్రాయటం ఏమిటి?''

సత్యం వాచీ చూసుకున్నాడు. ఒంటిగంటా పది నిముషాలయింది. అనూజ్ఞని చూసి నవ్వాడు. ''...సరిగ్గా ఒక నిముషం క్రితం శ్రీకళ్యాణి మరణించి ఉంటుంది. ఆస్తికి కార్తికేయ వారసుడై ఉంటాడు'' అన్నాడు.

అనూజ్ఞ దిగ్భ్రాంతురాలై, ''ఏ...మి...టి?'' అంది కంపిస్తూన్న గొంతుతో.

''అవన్నీ మాకు సంబంధించిన విషయాలు. ఇప్పుడు నేను చెప్పొచ్చేదేమిటంటే – శ్రీకళ్యాణి హత్య జరగ్గానే మొదటి అనుమానం కార్తికేయ మీదకు వెళుతుంది. కానీ నిజంగా ఆ హత్య చేసింది 'అశ్వత్థామ' అని... మాలో ఒకడు! నీకు 'ఉస్మాన్'నని పరిచయం చేసుకున్నాడే అతను! ఇప్పుడు నువ్వు మాకు సహకరిస్తే, నేనూ, ప్రతాపరెడ్డి కలిసి అశ్వత్థామని పోలీసులకి పట్టిస్తాం. ఆ పిస్టల్ ఎవరిదో, అతనికి ఎలా లభించిందో కూడా చెప్పి ఉరికంబం ఎక్కిస్తాం. ఒకవైపు అశ్వత్థామ ఉరికంబానికీ, మరోవైపు మీరు సిమ్లా హనీమూన్‌కీ వెళ్ళిపోవచ్చు. ఏమంటావ్?''

ఆమె ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. తిరిగి సత్యమే ''...ఇందులో ఆలోచించటానికి ఏమీ లేదు. నీకు ఇంతకన్నా మంచి అవకాశం రాదు. నీకు నీ ప్రియుడు దొరుకుతున్నాడుగా. శ్రీకళ్యాణి ఆస్తి నాకు ఇచ్చెయ్యటానికి నీకేమిటి అభ్యంతరం?'' అన్నాడు.

ఆమె దాన్ని పట్టించుకోకుండా, ''శ్రీకళ్యాణిగారు మరణించారా'' తనలో తనే అనుకుంటున్నట్టు దిగులుగా అంది.

''ఈ పాటికి చావకపోయి ఉంటే, ఇంకో గంట పోయాక చంపుతాం. సమస్య అది కాదు. కళ్యాణి చావుకి కారణం కార్తికేయ అన్న అనుమానం పోలీసులకి కలుగుతుంది. నువ్వు ఢిల్లీ నుంచి ఇక్కడకు రావటం, 'రజిత' అన్న పేరుమీద హోటల్ రూమ్ తీసుకోవటం, భార్యా భర్తలు ఘర్షణ పడటాన్ని నౌఖర్లు వినటం... కార్తికేయకు శిక్ష పడటానికి ఇవి చాలు. అసలు మీ ఇద్దరూ కలిసే ఈ హత్య చేశారన్న అభిప్రాయానికి కూడా జడ్జి రావొచ్చు.''

ఇంకా తేరుకోకుండా నిద్రలో ఉన్నట్టు ఆమె అతడి వైపు చూసింది. ''మీ ఇద్దరూ మెడ లోతు ఊబిలో ఇరుక్కుపోయారు. బయట పడాలంటే నేను చెప్పినదొక్కటే మార్గం.''

''లేకపోతే?''

సత్యం విసుగ్గా, ''ఎన్నిసార్లు చెప్పాలి? కార్తికేయని రక్షించుకోవాలంటే నువ్వు ఈ పని చేయక తప్పదు'' అన్నాడు.

''ఇంకో పనిచేసి కూడా కార్తికేయని తప్పించవచ్చు.''

''ఎలా?''

''శ్రీకళ్యాణి మర్డర్ నేను చేశానని చెప్పటం ద్వారా...''

సత్యం నిర్విణ్ణుడయ్యాడు. అనూజ్ఞ నవ్వింది. ''ఏం? ఇది బావోలేదా?'' అంది. ఈసారి సత్యం తేరుకోవటానికి కొంచెంసేపు పట్టింది. ''నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్థమవుతోందా?'' పళ్లు బిగించి అన్నాడు.

''కార్తికేయ సంగతి నీకు తెలీదేమో నాకు బాగా తెలుసు. భార్య మరణించిందని తెలిస్తే అతడు మామూలు మనిషి కాడు. అది మొదటి విషయం. ఇలాంటి బ్లాక్‌మెయిల్స్‌కు లొంగి సంతకాలు పెట్టడు. అది రెండో విషయం.''

''పెట్టక పోతే ఉరికంబం ఎక్కుతాడు.''

''ఎక్కడు. విషయం అంతవరకూ వస్తే నేను అతన్ని రక్షిస్తాను.''

సత్యంలో క్రమంగా సైకిక్ లక్షణాలు కనిపించసాగాయి. కథ ఇలా మలుపు తిరుగుతుందని అతను ఊహించలేదు. ''నీ జీవితం నువ్వే పాడు చేసుకుంటావా? మీ నాన్నకి నువ్వు ఒక్కతే కూతురివి. నువ్వు కూడా పోతావా! శోభనం చేసుకోవాల్సిన వయస్సులో ఉరికంబం ఎక్కుతావా?'' అతడి గొంతు వికృతంగా ధ్వనించింది. చివర్లో ఓ బూతు మాట కూడా ఉపయోగించాడు.

ఆమె తాపీగా ''ఈ కేసు ట్రయల్ కొచ్చేసరికి నేను ఎలాగూ ఈ భూమ్మీద ఉండను సత్యం. ఇంకో మూడు నాలుగు నెలల్లో నేను మరణించబోతున్నాను. హడ్జ్‌కిన్స్ డిసీజ్ నాకు'' అంది.

సగం తెరిచిన సత్యం నోరు అలాగే ఉండిపోయింది.

''ఇప్పుడు చెప్పు. నా ప్రేమకి ఇంతకన్నా మంచి ఆశయం మరొకటి ఉంటుందా!''

సత్యంలో పారనాయిడ్ లక్షణాలు మొదలయ్యాయి. చెవులు నిలువుగా అయ్యాయి. కనుగుడ్లలో ఎర్రజీరలు ఏర్పడసాగాయి. ''కార్తికేయని రక్షిస్తావ్. కానీ నీ తండ్రిని రక్షించుకోగలవా?'' అన్నాడు వెటకారంగా. అతడి చేతిలో కొన్ని ఫోటోలు, ఆడియో, వీడియో క్యాసెట్లు ఉన్నాయి.

''మీ అక్క మనోజ్ఞ నా ఫ్రెండ్. ఇద్దరం కలసి లైఫ్ చాలా ఎంజాయ్ చేశాం. ఇవిగో ఆ ఫోటోలు. ఇది నువ్వు నీ ప్రియుడికి పంపిన వీడియో క్యాసెట్టు. నువ్వు ఇక్కడ హోటల్‌లో దిగుతున్నట్లు వ్రాసిన ఉత్తరం తాలూకు ఫోటో కాపీ ఇది.

ఇవి నీ అక్కయ్య నాకు వ్రాసిన బూతు ఉత్తరాలు. సెంట్రల్ మినిష్టర్ కూతుళ్లు ఇద్దరూ శృంగార దేవతలు. ఈ టైటిల్ బావుందా? ఇప్పుడు చెప్పు. ఇది పత్రికల్లో పడితే మీ నాన్న గతి ఏమిటి? పదవి ఏమవుతుంది? తల ఎక్కడ పెట్టుకుంటాడు?''

అనూజ్ఞ కుర్చీలోంచి లేచి నిలబడింది.

''ఇప్పుడు నీ నిర్ణయం ఏమిటో చెప్పు. చచ్చిపోతున్నావు కాబట్టి కార్తికేయకి నీ అవసరం లేదు. కానీ చచ్చిపోతూ కూడా మీ నాన్నకి సాయం చెయ్యవా?''

''కొంచెం మంచినీళ్ళు తాగొచ్చా?''

''మింగుడుపడని విషయాలు చెప్పి మంచినీళ్ళు తాగిస్తున్నానా'' అంటూ సత్యం బిగ్గరగా నవ్వాడు.

ఆమె గ్లాసులో నీళ్ళు పోసుకుంటూ ''మా అక్క విషయం మా నాన్నగారికి తెలీదా?'' అంది.

''తెలుసు.''

''ఏమన్నారు?''

''నీకనవసరం.''

''నేను ఊహించగలను. మళ్ళీ గడప తొక్కితే కాళ్ళు విరగ్గొడతా అని ఉంటారు. అవునా! ఇక్కడ నువ్వు మర్చిపోయిందేమిటంటే నేను ఆయన కూతుర్నని.''

''అంటే?''

''అంటేనా'' అంటూ అనూజ్ఞ మెరుపు వేగంతో నీళ్ళ జాడి ఎత్తి అతడి తలమీద బాదింది. ఎంత బలంగా కొట్టిందంటే ఆ దెబ్బకి భళ్ళుమన్న శబ్దంతో గాజు పెంకులు గదంతా చిందరవందరగా పడ్డాయి. సత్యం మోకాళ్ళమీద కూలిపోయాడు.

దగ్గరగా వెళ్లి అతడి వైపు చూస్తూ ''ఇంకెప్పుడూ ఢిల్లీ అమ్మాయిల్తో పెట్టుకోకు'' అంది. అతడు సైకిక్ అన్న విషయం ఆమెకు తెలీదు. విపరీత పరిస్థితుల్లో ఈ మానసిక రోగులు బలమూ, తెగింపూ పొందుతారు. అతడు నెమ్మదిగా లేచాడు. అతని చెయ్యి పాంటు జేబు వైపు వెళ్ళింది.

ఊహించలేనంత వేగంతో జేబులోంచి కత్తి తీశాడు. ఆమె దగ్గరగా దూసుకు వెళ్ళి సర్రున గాలిలో కోశాడు. అయితే ఆమె అంత చురుగ్గానూ వెనక్కి తప్పుకుంది. క్షణం ఆలస్యం అవటంతో కత్తి చేతిని గాయపర్చింది. అప్పుడు గమనించిందామె అతడి చావు తెగింపుని. చటుక్కున గది బయటకు పరుగెత్తింది. ఆమె వెనుకనే సత్యం బయటకు వచ్చాడు.

ఖరీదైన హోటల్ కాబట్టి వరండా అంతా నిర్మానుష్యంగా ఉంది. ఆమె లిఫ్టు కోసం బటన్ నొక్కింది. మొదటి అంతస్తులో ఉన్న లిఫ్టు పైకి నాలుగో అంతస్తులోకి రాసాగింది.

తన వైపుకి సత్యం వేగంగా రావడం గమనించి మెట్ల మీద నుంచి పైకి పరుగెత్తింది. హోటల్ తాజ్ ఇంటర్నేషనల్ నాలుగంతస్తుల భవనం. పైన దాదాపు పదివేల చదరపు అడుగుల డాబా, మధ్యలో నాలుగు స్థంభాల మీద పెద్ద టాంక్ ఉంది.

సత్యం పైకి పరుగెత్తి ఆమెని వెంటాడబోయాడు. సరిగ్గా అదే సమయానికి లిఫ్టు ఆగడం, తలుపులు తెరుచుకోవడం జరిగాయి. అందులోంచి కార్తికేయ బయటకి వచ్చాడు. అతడిని చూడగానే సత్యంలో కసి కట్టలు తెంచుకుంది.

ఇతను– కళ్యాణిని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. తనకి అడ్డొచ్చాడు. ఇతడి కోసం ఇద్దరు స్త్రీలు తమ ప్రాణాలు అర్పించటానికి కూడా సిద్ధపడ్డారు. డామిట్. ఇంత అదృష్టం ఇతనికి ఎందుకుండాలి? కసి. కసితో కత్తిని గట్టిగా పట్టుకుని లిఫ్టులోంచి బయటకు వస్తున్న కార్తికేయ కడుపులో గట్టిగా పొడిచాడు. ఒకటి... రెండు... మూడు... రక్తం జివ్వున చిమ్మింది. కార్తికేయ కడుపు పట్టుకుని మూలిగాడు. అరచెయ్యి రక్తంతో తడిసి పోయింది. రక్తం ధారాపాతంగా క్రిందికి కారుతూ కార్పెట్‌ని తడిపేస్తోంది. ఆఖరి పోటు మరింత బలంగా పొడిచి పైకి చూస్తూ, ''రాక్షసీ... నువ్వూ తప్పించుకోలేవు. వస్తున్నా'' అంటూ పైకి పరిగెత్తాడు. అతను పైకి వస్తున్న సంగతి అనూజ్ఞకి తెలీదు.

టాంక్ పక్క నుంచి తల వంచి ద్వారం వైపు చూసింది. అక్కడ ఎవరూ లేరు. ఒక్కసారి క్రిందకి వచ్చేస్తే మనుష్యుల్లోకి వెళ్ళిపోవచ్చన్న ఉద్దేశ్యంతో ఆమె ద్వారం వైపు రాసాగింది.

మెట్ల పక్కగా అదే డాబా మీద మరో గది ఉంది. భవిష్యత్తులో హోటల్ అంతస్థులు పెంచటం కోసం లిఫ్టు అక్కడికి వచ్చేలా ఆ గది కట్టారు. గోడ పక్కనే ఉన్న సత్యాన్ని అనూజ్ఞ గమనించలేదు.

కళ్యాణీ పీటర్ల వెనుకే బయల్దేరిన అశ్వత్థామ హోటల్ తాజ్ ముందు కారు దిగాడు. పిస్టల్ జేబులో పెట్టుకుని రిసెప్షన్ వైపు నడవసాగాడు. అదే సమయానికి రిసెప్షన్‌లో రజిత గది గురించి ఎంక్వయిరీ చేస్తున్నాడు పీటర్. రిసెప్షనిస్టు 403 అని చెప్పాడు. పెద్ద హోటల్స్ సంగతి పీటర్‌కి సరిగ్గా తెలీదు. ''ఎన్నో అంతస్థు'' అని అడిగాడు.

''టాప్ ఫ్లోర్ సర్''

ఈ లోపులో కళ్యాణి కుర్చీ తోసుకుంటూ లిఫ్టు లోపలికి వెళ్ళింది. పీటర్ పరుగెత్తుకు వచ్చి కుర్చీ పట్టుకుంటూ ''నే వస్తున్నానుగా మాడమ్'' నిష్ఠూరంగా అన్నాడు.

కళ్యాణి నవ్వి ''ఎప్పటికయినా నా పనులు నేనే చేసుకోవాలిగా. మీరు క్రిందే ఉండండి'' అంది.

పీటర్ నమ్మశక్యం కానట్టు ఆశ్చర్యంగా ''మీరొక్కరే వెళతారా?'' అన్నాడు.

''అవును. ఇది మా ముగ్గురికీ సంబంధించిన విషయం కదా'' అంది.

పీటర్ మాట్లాడలేకపోయాడు. శ్రీకళ్యాణి రిలాక్సింగ్‌గా నవ్వి ''మీరేమీ కంగారుపడకండి. అక్కడ నేనేమీ దారుణమైన పనులు చెయ్యను. అసలు నాకు అ అమ్మాయి మీద ఏ విధమైన కోపమూ లేదు. నాకు తనో చిన్నపిల్లలా కనపడుతుంది''

అని, లిఫ్ట్ మూసుకుపోతూ ఉండగా ''ఆర్టిస్టులు సాధారణంగా నాలాంటి మెటీరియలిస్టుల కన్నా చిన్న పిల్లలనే ఇష్టపడతారు'' అంది.

అందులో భావం అర్థమై పీటర్ మొహం వివర్ణమైంది. అతడేదో అనబోయాడు. అప్పటికే లిఫ్ట్ పైకి బయల్దేరింది.

లోపల కళ్యాణి లిఫ్ట్‌బటన్స్ వైపు చూసింది. 'రజిత ఉన్న రూమ్ 'టాప్ ఫ్లోర్' అని రిసెప్షనిస్టు అనటం విన్నది. అందుకు '4' బదులు 'టి' (టెర్మినస్) అన్న బటన్ నొక్కింది.

అదే సమయానికి నీళ్ళ టాంకుల మధ్యనుంచి నడుచుకుంటూ వచ్చిన అనూజ్ఞని వెనుక నుంచి పట్టుకుని, ఒక చేత్తో నోరు గట్టిగా మూసి మరో చేత్తో కడుపులో పొడవబోయాడు. అతడి చేతుల మధ్య అనూజ్ఞ గింజుకుంటోంది. ఈసారి అతను కత్తి ఉపయోగించలేదు. రెండు చేతుల్తో ఆమెని అలాగే పట్టుకుని పిట్టగోడ మీదుగా క్రిందికి విసిరేశాడు. క్రిందికి జారుతూ అనూజ్ఞ కెవ్వున అరిచింది.

ఆ సమయానికి డాబా మీద ఆగిన లిఫ్టు తలుపులు తెరుచుకున్నాయి. చక్రాల కుర్చీతో కల్యాణి బయటకు వచ్చింది. చీకట్లోంచి ఒక్కసారిగా అంత ఎండలోకి రావటం వల్ల ఆ మధ్యాహ్నపు వెలుగుకి కళ్ళు వెంటనే అలవాటు పడలేదు. మొహాన్ని గాలి తీవ్రంగా తాకింది. వెళ్ళవలసిన అంతస్థు కన్నా ఒక ఫ్లోర్ పైకి వచ్చాననీ, అది హోటల్ పై భాగాన ఉన్న డాబా అని మాత్రం అర్థమైంది. అదే సమయానికి గాలిలో ఒక ఆర్తనాదం వినిపించింది.

శ్రీకళ్యాణికి అనూజ్ఞ స్వరం తెలీదు. ఎవరో ఎవర్నో చంపుతున్నారని కూడా ఊహించలేదు. ఎవరో అమ్మాయి ప్రమాదంలో ఉన్నదనుకుని, చక్రాల కుర్చీ తోసుకుంటూ ముందుకు వెళ్ళింది.

నీళ్ళటాంకు పక్కనే ఉన్న సత్యాన్ని చూడలేదు కానీ సత్యం ఆమెను చూశాడు.

ఆ సమయంలో ఆమెని అక్కడ చూడటం వల్ల కలిగిన ఆశ్చర్యం కన్నా, అలాటి అవకాశం దొరికినందుకు పెదాలమీద ఒక సాడిస్టిక్ నవ్వు కదలాడింది. ఆమె దగ్గరకి వచ్చేవరకూ నీళ్ళ టాంకు పక్కనే కదలకుండా నిలబడ్డాడు.

పొంచి ఉన్న ప్రమాదాన్ని గమనించకుండా శ్రీకళ్యాణి సరీగ్గా అటువైపే వెళ్ళింది. టాంకు పక్కనుంచి ఆమె వెళుతూండగా వెనుక నుంచి కుర్చీని మెరుపువేగంతో ముందుకి తోశాడు. ఎంత బలంగా తోశాడంటే, ఏం జరిగిందో తెలుసుకునే లోపులో కుర్చీ డాబా అంచుకి చేరుకుంది. వెనుదిరిగి చూసే సమయం కూడా ఆమెకి లేదు. మృత్యువు వైపు దూసుకు వెళ్తున్నట్లు కుర్చీ వెళుతోంది. అక్కడ పిట్టగోడ లేదు. స్థంభాల ఊచలు ఉన్నాయంతే. ఆమె అరవలేదు.

అరవటానికి టైమ్ లేదు.

అయితే కారణం అది ఒక్కటే కాదు. ఆమెలో అంతర్లీనంగా ఉన్న ధైర్యం!

కాళ్ళతో కుర్చీ వేగాన్ని నిరోధించటానికి ప్రయత్నించింది. వేగం తగ్గలేదు. కెమేరా లెన్స్ 'జూమ్' చేసినట్టు, అంచున ఉన్న ఇనుప ఊచలు దగ్గరవుతున్నాయి. కాళ్ళని ఆ ఊచలకి అడ్డుపెట్టి ఆగటానికి ప్రయత్నించింది కానీ రెండు ఊచల మధ్య

నుంచీ కుర్చీ ముందుకు సాగింది. విపత్కర పరిస్థితుల్లో వచ్చే తెగింపో, 'క్రైసిస్ మానేజ్‌మెంట్' జీర్ణించుకోవటం వల్ల వచ్చిన లక్షణమో, కుర్చీ వేగం తగ్గించటానికి కాళ్ళలోని శక్తినంతా ఉపయోగించింది. కానీ దురదృష్టం వెంటాడుతోంది. ఊచల మధ్యనుంచి కుర్చీ క్రిందికి జారిపోయింది. కుర్చీతోపాటు ఆమె కూడా క్రిందికి జారబోతూ నిస్సహాయంగా చేతులు గాలిలోకి సాచింది.

ఆఖరి క్షణంలో చేతికి ఇనుప ఊచ దొరికింది. దాన్ని గట్టిగా పట్టుకుని అక్కడే వేలాడ సాగింది. సరిగ్గా అరనిముషం తరువాత కుర్చీ నేలమీద పడిన చప్పుడు లీలగా వినిపించింది. క్రిందికి చూసింది. ఐదు అంతస్తుల క్రింద చక్రం విరిగిపోయిన కుర్చీ అస్థిపంజరంలా కనపడింది. ఆమె గట్టిగా కళ్ళు మూసుకుంది. ఆమె బరువుకి ఊచ బాగా వంగిపోతోంది. తన బరువుని రెండు చేతుల్తో ఆపటం అసాధ్యమవుతోంది.

కుర్చీతో సహా శ్రీకళ్యాణి జారిపోయాక సత్యం తాపీగా మెట్లు దిగసాగాడు. నాలుగో అంతస్తు లిఫ్టు దగ్గర కార్తికేయ శరీరాన్ని చూశాడు. దాన్ని పట్టించుకోలేదు. మెట్ల మీద నుంచే మూడో అంతస్తుకి దిగాడు.

ఆయాసంతో వగరుస్తూ మెట్లు ఎక్కుతూ కనబడ్డాడు డాక్టర్ అశ్వత్థామ. పైకి వస్తున్నాడు. అతన్ని కూడా అక్కడే పొడిచి పారేద్దామా అనుకున్నాడు కానీ ఆగి, "అంతా అయిపోయాక ఇప్పుడా రావటం'' అన్నాడు కాస్త వెటకారంగా.

''శ్రీకళ్యాణిని ఇంట్లో చంపే వీలులేకపోయింది. వెంటాడుతూ వచ్చాను''.

''ఏడవలేక పోయావు'' మనసులో అనుకునన్నాడు. అప్పుడొచ్చింది ఆలోచన. గతంలో తనూ, ప్రతాపరెడ్డి కలిసి ఈ కేసులో అశ్వత్థామని ఇరికించాలని అనుకున్న ఆలోచన..!

''ప్రతాపరెడ్డి ఇచ్చిన పిస్టల్ ఎక్కడ?'' అని అడిగాడు.

''నా దగ్గరే...''

''ఇలా ఇవ్వు''

మామూలు పరిస్థితిలో అయితే అశ్వత్థామ ఇచ్చేవాడు కాదు. కానీ ఇప్పుడు తను చేసిన తప్పుకి డిఫెన్సులో ఉన్నాడు. అందుకని మారు మాట్లాడకుండా ఇచ్చాడు. సత్యం తన చేతిలో కత్తి అతనికి ఇస్తూ, ''పైన డాబా మీద కళ్యాణి ఉంది. వెళ్ళి పొడిచెయ్'' అన్నాడు.

''నువ్వు చంపలేదా? ఈ రక్తం ఏమిటి?'' బాకుకి అంటిన రక్తాన్ని చూస్తూ అడిగాడు.

సత్యం కఠినంగా ''అవన్నీ నీకు చెప్పాలా? ఒక్క పనీ చెయ్యకుండా లక్షలు ఎలా సంపాదిద్దామనుకున్నావ్? వెళ్ళి చెప్పిన పని చెయ్యి'' అని గద్దించాడు.

అప్పుడే లిఫ్టు మూడో అంతస్తులోకి వచ్చి ఆగింది. ఎవరో కష్టమరు బయటకు వచ్చాడు. అశ్వత్థామ దానిలో ప్రవేశించి పైకి వెళ్ళాడు. సత్యం ఒక క్షణం అటువైపే చూసి క్రిందికి దిగిపోయాడు.

లిఫ్ట్ ఆగగానే అశ్వత్థామ బయటకు వచ్చాడు. డాబా మీద అంతా నిర్మానుష్యంగా ఉంది. ఎవరూ లేకపోయేసరికి తిరిగి లిఫ్టులో ప్రవేశించ బోతూ ఉండగా గాలిలోంచి లీలగా 'హెల్ప్' అన్న అరుపు వినిపించింది. చప్పున లిఫ్ట్ లోంచి బయటకు వచ్చాడు. ఆ అరుపు ఎట్నుంచి వినపడిందో అర్థం కాక చుట్టూ చూస్తూన్న సమయంలో నీళ్ళట్యాంకు అవతల్నించి అదే స్వరం మరోసారి వినపడటంతో అటు వెళ్ళాడు. ఊచలకి వేలాడుతూ కళ్యాణి కనపడింది.

తలెత్తి అతడిని చూసి ''హెల్ప్'' అంది. అశ్వత్థామ మోకాళ్ళ మీద కూర్చున్నాడు.

ఒకసారి ఆమె వైపు కన్నార్ప కుండా చూసి చేతిలో ఉన్న కత్తితో ఆమె చేతి వేళ్ళ మీద గాటు పెట్టాడు. బాధగా అరుస్తూ ఒక చెయ్యి వదిలేసింది. రెండో చేతిమీద గాటు పెట్టబోయాడు.

అదే సమయానికి పైకి వచ్చిన పీటర్‌కి, ఊచలు పట్టుకుని వేలాడుతున్న కళ్యాణీ, క్రిందికి వంగి ఆమె రెండో చెతి మీద గాటు పెట్టబోతూన్న అశ్వత్థామా కనపడ్డారు.

పీటర్ సంశయించలేదు. రివాల్వర్ తీసి వరుసగా రెండు సార్లు పేల్చాడు. వంగి కూర్చున్న అశ్వత్థామ హిప్స్ మధ్య నుంచి ఒక బులెట్ పైకి పయనించి, వెన్నెముకకి సమాంతరంగా గుండెల వరకూ ప్రయాణం చేసింది. నిశ్శబ్దంగా నాలుగు అంతస్తులు గాలిలో జారి నేలకూలాడు.

పీటర్ పరుగెత్తుకు వెళ్ళి శ్రీకళ్యాణికి చెయ్యి అందించాడు. ఆమె పిట్టగోడ మీద కాలుపెట్టి నెమ్మదిగా పైకి లేచింది. చేతిలోంచి రక్తం కారుతోంది.

''ఏమీ అపాయం లేదుగా మాడమ్?'' ఆదుర్దాగా అడిగాడు.

''లేదు'' అనబోతూ ఏదో స్ఫురించిన దానిలా చప్పున తన కాళ్ళవైపు చూసుకుంది. అదే సమయానికి పీటర్‌కి కూడా విషయం అర్థమైంది. ఆమె మనసు చెలియలి కట్టలేని ఆనంద సముద్రమై సంతోషంతో ఊగిపోయింది. ఆనందంతో నీళ్లు నిండిన కళ్ళతో... ''నా కాళ్లు... నా కాళ్లు...'' అనబోయింది. కానీ అది క్షణం సేపే. సంతోషం కన్నా కర్తవ్యం ముఖ్యమని ఆమె ప్రతి క్షణమూ గుర్తుంచుకుంటూనే ఉంటుంది.

పీటర్‌కి సూచన్లు ఇవ్వటం ప్రారంభించింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments